క్లుప్తంగా

సీసీ బెడ్లు నిర్మించాలి



అయిజ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్ మైదానంలో సీసీబెడ్లు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ధాన్యం నేల మీద ఆరబోయడంతో వర్షానికి తడిసి ముద్దవుతుందని వాపోతున్నారు. ధాన్యం రాశులపై కవర్లు కప్పినా కింద నుంచి నీరు ధాన్యం రాశుల కిందకు చేరి తడిసిపోతుందని పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి యార్డ్ మైదానంలో సీసీబెడ్లు నిర్మించాలని మండల రైతులు కోరుతున్నారు.

అధ్వానంగా అంతర్రాష్ట్ర రహదారి



అయిజ: కర్నూలు– రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారిపై ప్రయాణించాలంటేనే అవస్థలు పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుపై మోకాటి లోతు గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు పనులు ప్రారంభించి పది సంవత్సరాలు పూర్తవుతున్నా ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా రోడ్డు పరిస్థితి మారడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసుల నమోదు

గద్వాల క్రైం: పట్టణ శివారులో ఆదివారం సాయంత్రం పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ సిబ్బంది కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీలో మద్యం తాగి వాహనం నడుపుతూ ఐదుగురు పట్టుబడగా వారిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హోరెత్తిన మైసమ్మ నామస్మరణ



నవాబుపేట: మండలంలోని పర్వాతాపూర్ మైసమ్మ దేవాలయం చెంత భక్తుల సంత కొనసాగింది. ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు అడవిలో వెలసిన మైసమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో పాటు అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. భక్తుల సందడితో అడవి మొత్తం మైసమ్మ నామస్మరణ హోరెత్తింది. అటు జిల్లా కేంద్రం, ఇటు మండల కేంద్రం ప్రధాన రోడ్లు జనంతో కిటకిటలాడాయి. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు చదువుతో పాటు కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని ఎంఐఎం జిల్లా అధ్యక్షులు అబ్దుల్ హాదీ అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో కింగ్‌షోటోకాన్ కరాటే డూ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత కరాటే శిక్షణలో భాగంగా ఆదివారం యోగా శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అబ్దుల్ హాదీ యోగా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 27 ఏళ్ల నుంచి జహంగీర్‌పాష ఖాద్రీ వేసవిలో ఉచిత కరాటే శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. కరాటే శిక్షణను వేసవి వరకు పరిమితం కాకుండా నిరంతరం ప్రాక్టిస్ చేయాలని కోరారు. కింగ్‌షోటోకాన్ వైస్ చైర్మన్ చెన్న వీరయ్య మాట్లాడుతూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. అంతకుముందు యోగా టీచర్ బాలమణి యోగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ మీర్ అర్షద్‌అలీ, కింగ్‌షోటోకాన్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రఫీక్ అహ్మద్, మహ్మద్ అతహర్, ఎండీ జాకీర్, కరాటే విద్యార్థులు నవీన్, అర్ష్ జమీల్, అమాన్‌ఖాన్, మహ్మద్ షరీఫ్, తుపుడ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ మురుగుమయం



కొత్త బస్టాండ్ వద్ద రోడ్డుపై నిలిచిన మురుగు

- అస్తవ్యస్థంగా డ్రైయినేజీ నిర్మాణం
- శిథిలమైన మురుగు కాల్వలు
- ఇబ్బందులు పడుతున్న అయిజ ప్రజలు

అయిజ: మున్సిపాలిటీ మురుగుతో కంపు కొడుతుందని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పన్ను వసూళ్లపై ఉన్న శ్రద్ధ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంపై లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పట్టణంలో డ్రైయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, చిన్నపాటి వర్షానికే ప్రధాన రహదారులు, వీధులు వర్షపు నీటితో నిండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు.

రోడ్లపై నిలుస్తున్న మురుగు

అయిజ పట్టణంలోని 20 వార్డుల్లో 8,065 నివాస, వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. రోడ్లపై మురుగు నిలుస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నట్లు వ్యాపారులు, ప్రజలు వాపోతున్నారు. కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో మురుగు రోడ్లకు ఇరువైపులా నిలుస్తుంది. పాత బస్టాండ్ సమీపంలోని నాలుగు రోడ్ల కూడలిలో రోడ్డుపై మోకాలు లోతు గుంతలు పడి వర్షపు నీరు నిలిచి మురుగుగా మారి దుర్వాసన కొడుతుందని వాపోతున్నారు.

అప్రోచ్ రోడ్డుకిరువైపులా

పట్టణంలోని కొత్త బస్టాండ్ అంబ భవానీ ఆలయం పరిసర ప్రాంతంలో నూతనంగా నిర్మించిన హైలెవల్ బ్రిడ్జికి ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా మురుగు నిలుస్తుంది. అదే విధంగా పట్టణంలోని పాత బస్టాండ్‌లో అయిజ– గద్వాల, తూంకుంట– ఎక్లాస్‌పురం రోడ్డు సంబంధించిన నాలుగు రోడ్ల కూడలి వర్షం పడిన ప్రతిసారి చెరువును తలపిస్తుంది. రాత్రి సమయంలో వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. నీటి మడుగులో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు.

అస్తవ్యస్తంగా డ్రైయినేజీ నిర్మాణం

మున్సిపాలిటీలో గతంలో అయిజ గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన మురుగు కాల్వలు పూర్తిగా శిథిలమయ్యాయి. నిర్మాణానికి సంబంధించిన గోడరాళ్లు ఊడి కాల్వలో పడుతుండటంతో మురుగు ముందుకు కదలని పరిస్థితి. అదే విధంగా వివిధ కాలనీల్లో గత 10 సంవత్సరాల్లో డ్రైయినేజీలు ప్రణాళికబద్ధంగా నిర్మించకపోవడంతో వర్షపు నీరు ముందుకు వెళ్లకుండా ఆయా ప్రదేశాల్లో మురుగుగా నిలుస్తుంది.

లోపభూయిష్టంగా ప్రణాళిక

డ్రైయినేజీ నిర్మాణం చేపట్టేటప్పుడు డ్రైయినేజీ నీటితోపాటు వర్షపు నీటి పరిమాణాన్ని అంచనా వేసి దానికి తగ్గట్టు డ్రైయినేజీ ఎత్తు వెడల్పు నిర్మించాలి. ఇవేవి దృష్టిలో పెట్టుకోకుండా డ్రైయినేజీ నిర్మించడంతో పట్టణంలో వర్షం పడిన ప్రతిసారి మురుగు రోడ్లపై, లోతట్టు ప్రదేశాల్లో నిలుస్తుంది. డ్రైయినేజీ నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లు నాణ్యత పాటించకపోవడంతో నిర్మాణం చేపట్టిన పదేళ్లలోపే శిథిలావస్థకు చేరుకున్నాయని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పాత బస్టాండ్ నాలుగురోడ్ల కూడలిలో నిలిచిన మురుగు నీరు

మురుగు కదలడం లేదు



మున్సిపాలిటీలో నిర్మించిన డ్రైయినేజీ కట్టడాలు ప్రణాళిక ప్రకారం చేపట్టకపోవడంతో వర్షపు నీరు ముందుకు సాగడం లేదు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో మురుగు నిలిచి ఉంటుంది. దీంతో పట్టణ వాసులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

– శ్రీనువాసులు, అయిజ

కాల్వలు శిథిలం



పట్టణంలో గతంలో నిర్మించిన మురుగు కాల్వలు పూర్తిగా శిథిలమయ్యాయి. దీంతో వర్షపు నీరు ముందుకు కదలడం లేదు. కొన్ని కాలనీల్లో ఇప్పటి వరకు డ్రైయినేజీలు నిర్మించలేదు. ప్రణాళిక ప్రకారం డ్రైయినేజీల నిర్మాణం చేపట్టాలి.

– వెంకటేష్, అయిజ

నిధుల కొరత



అభివృద్ధి పనులు చేసేందుకు మున్సిపాలిటీలో నిధుల కొరత ఉంది. దీంతో డ్రైయినేజీల నిర్మాణ పనులు పూర్తిగా చేపట్టలేదు. ముఖ్యంగా కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ ప్రధాన రోడ్లపై డివైడర్ నిర్మించి, ఇరువైపులా డ్రైనేజీలు చేపట్టి వర్షపు నీరు నిల్వకుండా పనులు చేపట్టాల్సి ఉంది.

– సీహెచ్ సైదులు, మున్సిపల్ కమిషనర్

శిథిలావస్థలో పశువైద్య కేంద్రం



శిథిలావస్థకు చేరుకున్న పశువైద్య కేంద్రం

మల్దకల్: మండల పరిధిలోని బిజ్వారంలో పశు వైద్య కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. 23 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం పైపెచ్చులూడి కడ్డీలు తేలి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వైద్య సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. అదే వైద్యశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశువులకు వైద్యం చేయించేందుకు కూడా అవస్థలు పడుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న పశువైద్య కేంద్రాన్ని తొలగించి నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, పశు వైద్యసిబ్బంది కోరుతున్నారు.

'రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి'

గద్వాల టౌన్/ ధరూరు: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కొత్తకుంట్ల శ్రీలక్ష్మి అన్నారు. ఆదివారం గద్వాల పట్టణం, ధరూరు మండల కేంద్రంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, గద్వాల టౌన్ అధ్యక్షుడు బి.నర్సింహులు అధ్యక్షతన రజకులతో ఆమె సమావేశమయ్యారు. రజకుల చిరకాల వాంఛ అయిన ఎస్సీ జాబితాలో చేర్చాలనే అంశాన్ని ప్రభుత్వాలు పక్కన పెట్టడం సమంజసం కాదన్నారు. వెనుకబడిన రజకులు అభివృద్ధి చెందేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. ఎస్సీ జాబితాలో చేర్చేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా రజక సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ సవారన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



సవారన్నను సన్మానిస్తున్న కొత్తకుంట్ల లక్ష్మి

అనంతరం రజక ఎస్సీ సాధన సమితి 8వ వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిన్నపాటి నర్సింహులు, జయశ్రీ ధరూరు గ్రామ అధ్యక్షుడు ఫోటో రవి, నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, రంగేష్, శేఖర్, కారం రవి, గోపాల్, అంజి తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

ధరూరు: మండల పరిధిలోని మార్లబీడులో నూతనంగా నిర్మించిన సీసీరోడ్డుపై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. గట్టుకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో రెండు నెలల క్రితం సీసీరోడ్డు వేశారు. ఈ నేపథ్యంలో బస్టాండ్ వద్ద మలుపులు ఉండటం రోడ్డు వాలుగా ఉండటంతో ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. ఆదివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి పలువురు గాయాలపాలయ్యారు. ఆర్‌అండ్‌బీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.



మార్లబీడులో ప్రమాదం జరిగిన ప్రదేశం

మంత్రి ఆదేశాలు బేఖాతర్ ?

వనపర్తి: ధాన్యం కొనుగోళ్ల విషయంలో సమస్యలు ఎక్కడ ఉత్పన్నమవుతున్నాయన్న అంశాన్ని తెలుసుకునేందుకు శనివారం జిల్లా కేంద్రంలోని కళ్యాణ సాయి ఫంక్షన్ హాల్‌లో అధికారులు, రైతులు, మిల్లర్లు, లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో రాష్ట్ర అబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహించిన విషయం విదితమే. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో మిలులకు చేర్చడం లేదని ఫిర్యాదులు రైతుల నుంచి ఎక్కువగా వినిపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి.. జిల్లాలోని 15 మండలాల్లో ఏర్పాటు చేసిన అన్ని కొనుగోలు కేంద్రాలకు ఏడు రూట్లలో 350 లారీలను ఏర్పాటు చేయాల్సి ఉందని, అగ్రిమెంట్ మేరకు కాంట్రాక్టర్లు ఒక్కొక్కరు 50 లారీలను ధాన్యం తరలించేందుకు అందుబాటులో ఉంచితే సమస్య ఎందుకు ఉత్పన్నమవుతుందని ప్రశ్నించారు. అగ్రిమెంట్ మేరకు ప్రతి కాంట్రాక్టర్ 50 లారీలను సిద్ధం చేసి ఉంచారనేందుకు నమ్మకం కలగడం లేదని, ఎట్టి పరిస్థితుల్లో ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు జిల్లా కలెక్టరేట్ ఆవరణలో కాంట్రాక్టర్లు అందరూ తాము అగ్రిమెంట్ చేసిన ప్రకారం ఆయా నంబర్లు గల లారీలను అధికారులకు ఫిజికల్‌గా చూపించాలని ఆదేశించారు. ఈ విషయాన్ని సమీక్ష ముగిసే లోపు పలుమార్లు మంత్రి ప్రస్తావించి అధికారులకు సీరియస్‌గా సూచన చేశారు. ఒకవేళ ఎక్కడైనా ధాన్యంతో లోడై ఉన్న లారీలు ఉంటే మిల్లులో అన్‌లోడ్ చేసి తెల్లవారేసరికి కలెక్టరేట్ వద్దకు ఆయా లారీలను రప్పించాలని కాంట్రాక్టర్లను అధికారులను ఆదేశించారు.

తెల్లారేసరికి సీన్ రివర్స్ :

మంత్రి ఈ విషయంపై ఎలాంటి వెసులుబాటు కల్పించకపోయినా.. ఆదివారం కనీసం ఒక్కటంటే ఒక్క లారీ కూడా స్పాట్ వద్దకు ఫిజికల్‌గా తీసుకొచ్చి అధికారులకు చూపించకపోవడం శోచనీయం. ఈ విషయాన్ని అధికారుల సైతం సీరియస్‌గా తీసుకున్నట్లు లేదని రైతులు చర్చించుకుంటున్నారు. రాష్ట్ర మంత్రి ఆదేశాలనే లెక్కచేయని లారీ కాంట్రాక్టర్లు.. ఇక అధికారుల మాట ఏ మేరకు వింటారో చెప్పనక్కర్లేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై డీఎం సివిల్ సప్లై కార్పొరేషన్ వనపర్తి జిల్లా జగన్మోహన్‌ను వివరణ కోరగా.. చాలా చోట్ల లారీలు ధాన్యంతో లోడై ఉన్నాయని.. రాత్రికి రాత్రే వాటిని అన్‌లోడ్ చేసి తీసుకురావడం సాధ్యం కాలేదన్నారు. ఆయా కాంట్రాక్టర్ల పరిధిలోని లారీలను మంత్రి జూపల్లి కృష్ణారావుకు స్వయంగా లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లే వీడియో కాల్ చేసి చూపిస్తారని సమర్థించారు.

రాష్ట్ర కార్యదర్శిగా రాము

వనపర్తిటౌన్: హిందూ రాష్ట్ర సభ జాతీయ అధ్యక్షుడు సొపర్నిక విజేంద్ర పురి, రాష్ట్ర అధ్యక్షురాలు నారాయణదాసు జ్యోతిరమణ రాష్ట్ర సెక్రటరీగా బచ్చురామును నియమిస్తూ ఆదివారం నియామకపత్రాన్ని జారీ చేశారు. ఈ మేరకు బీజేపీ నాయకులు బచ్చు రాముకు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచిన నాయకులకు రాము కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలో అభివృద్ధి పనులకు రూ.68 లక్షల నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి ఆదివారం పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. పెబ్బేరు మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. అయ్యవారిపల్లి గ్రామ పంచాయతీ భవనానికి 20 లక్షలు, యాపర్ల, శాఖాపూర్, వై.కొత్తసూగూరు, తోమాలపల్లి గ్రామాల్లో ఒక్కొక్క అంగన్‌వాడీ భవ న నిర్మాణానికి రూ.12 లక్షల నిధులు మంజూరైన ట్లు తెలిపారు.

గోడు వినేదెవరు..?

- గోపాలమిత్రలకు వేతనాలు అందక ఇబ్బందులు
- తొమ్మిది నెలలుగా ఇదే దుస్థితి
- ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో మొత్తం 214 మంది గోపాలమిత్రలు



పశువైద్యుడితో కలిసి పశువులకు సేవలందిస్తున్న గోపాలమిత్ర

మరికల్: మారుమూల పల్లెలు.. పశువైద్యశాలలు అందుబాటులో లేని పల్లెల్లో పాడి రైతుల ఇంటి ముంగిట్లో అత్యవసర సేవలు అందిస్తూ.. పశువులకు సంబంధించిన సీజనల్ వ్యాధులపై వాటి యజమానులను అప్రమత్తం చేస్తూ.. పశువులకు అత్యవసర చికిత్సలు చేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు గోపాలమిత్రలు. ప్రస్తుతం వారి పరిస్థితి దయనీయంగా మారింది. తొమ్మిది నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. నిత్యం గ్రామాలను తిరుగుతూ క్షేత్రస్థాయిలో పాడి రైతులకు సేవలందించడంతోపాటు ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ, సామాజిక కార్యక్రమాల్లో సైతం గోపాలమిత్రలు భాగస్వామ్యం అవుతున్నారు. కానీ వీరి గోడు మాత్రం ఎవరూ వినడం లేదు. ఒకటి కాదు.. రెండు కాదు.. తొమ్మిది నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 214 మంది గోపాలమిత్రలు ఉన్నారు. వీరంతా వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా నెట్టుకొస్తున్నారు.

పశువైద్యంలో కీలకపాత్ర

వ్యవసాయ అనుబంధంగా పాడి రంగంలో మేలు జాతి ఆవులు, గేదెల పునరుత్పత్తి, పాల ఉత్పత్తి, ఉత్పాదక పెంపు లక్ష్యంగా గోపాలమిత్ర వ్యవస్థ ఏర్పాటైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 2.50 లక్షలకు పైగా పశువులు ఉండగా 214 మంది గోపాలమిత్రలు సేవలు అందిస్తున్నారు. పశువులకు కృతిమ గర్భధారణ చేయడంతోపాటు మేకలు, గొర్రెలకు వీరు ప్రాథమిక వైద్యం అందిస్తున్నారు. అలాగే పశువులకు టీకాలు, నట్టలు, గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయడంలో గోపాలమిత్రల పాత్ర కీలకం. ఒక్కొక్కరికి నెలకు గౌరవ వేతనంగా రూ.11,050 చెల్లిస్తున్నారు.

లక్ష్యాన్ని చేరుకోలేదంటూ..

పశువుల సంఖ్య మేరకు గోపాలమిత్రలకు కృతిమ గర్భధారణ లక్ష్యాన్ని నిర్దేశిస్తున్నారు. ఒక్కో గోపాలమిత్ర నెలకు 100 పశువులకు కృతిమ గర్భధారణ చేయాలి. కానీ గ్రామీణ ప్రాంతాలు కావడంతో పాడి రైతులు సహజ గర్భధారణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో వీరు లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ఇదే కారణం చూపుతూ అధికారులు గోపాలమిత్రల వేతనాల్లో కోతలు విధిస్తున్నారు. అసలే అంతంత మాత్రంగా వచ్చే వేతనాల్లో.. కోత విధించడంతో మేం ఎలా బతికేది అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు నెల నెల వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి వస్తోందని వాపోతున్నారు. ఈ విషయంపై పలువురు గోపాలమిత్రలు తమ ఇబ్బందులను మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా వేతనాలు విడుదల చేసేలా చూడాలని కోరుతున్నారు.

బడ్జెట్ రావాల్సి ఉంది

గోపాల్‌మిత్రలకు సంబంధించి 9 నెలల వేతనాలు రావాల్సి ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. బడ్జెట్ విడుదల కాగానే వారి ఖాతాల్లో వేతనాలు జమ చేస్తాం.

– మధుసూదన్‌గౌడ్, జేడీ, మహబూబ్‌నగర్

ఈదురుగాలులతో కూడిన వర్షం



మానవపాడు- చెన్నిపాడు దారిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. మానవపాడు నుంచి చెన్నిపాడు, పెద్దపోతులపాడు మీదుగా వాగులు ప్రవాహించి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాల్లో అకాల వర్షంతో పొగాకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వర్షానికి కూలిన మట్టి మిద్దె

మండలంలోని చెన్నిపాడులో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి శేషమ్మకు చెందిన మట్టి మిద్దె కూలింది. కూలిన సమయంలో ఎవరు లేకపోవడం పెను ప్రమాదం తప్పింది. మిద్దె కూలడంతో ఇల్లంతా జలమయం అయింది. ప్రభుత్వం తరపున ఆదుకోవాలని శేషమ్మ పేర్కొన్నారు.

వేపచెట్టుపై పడిన పిడుగు

మండలంలోని ఏ.బుర్దిపాడు గ్రామంలో వేపచెట్టుపై పిడుగు పడింది. పిడుగు పడిన ప్రదేశంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ధరూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో చిరు జల్లులు కురిశాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మొన్నటి వరకు ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలు హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలు పడుతుండటంతో రైతులు పొలం పనులు షూరు చేశారు.

ఉండవెల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. పుల్లూరు శివారులోని జాతీయ రహదారిని కమ్మేసినట్టుగా ఉండే కారు మబ్బులను సాక్షి క్లిక్ మనిపించింది. మబ్బులను చూస్తు మట్టి వాసనను ఆస్వాదిస్తూ వాహనదారులు ఆనందానుభూతి చెందుతూ ప్రయాణాలు సాగించారు.



ధరూరులో కురుస్తున్న వర్షం



మానవపాడులో కూలిన మట్టి మిద్దె



ఏ.బుర్దిపాడులో వేపచెట్టుపై పడ్డ పిడుగు



పుల్లూరు శివారులోని జాతీయ రహదారిపై కమ్మేసిన మబ్బులు

ప్రయాణం.. ఆహ్లాదభరితం

పెద్దపోతులపాడు నుంచి చెన్నిపాడు వెళ్లే దారిలో రోడ్డుకిరువైపులా విరబూసిన పూలచెట్లు



మండలంలోని పెద్దపోతులపాడు నుంచి చెన్నిపాడు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా పూల చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. దృశ్య రూపకంగా ప్రయాణికులను కనువిందు చేస్తున్నాయి. వేసవిలో భానుడి భగభగలతో ప్రయాణిస్తున్న వాహనదారులకు నయనానందానిస్తున్నాయి.

- మానవపాడు